వరద బాధితులకు దుస్తులు, నిత్యవసరాలు పంపిణీ

విశాలాంధ్ర-వి.ఆర్. పురం : ఇటీవల సంభవించిన శబరి గోదావరి నదుల ఇబ్బందులు పడుతున్న బీసీ కాలనీ గ్రామస్తులకు వరదలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరద బాధితులకు అండగా తమవంతు సహాయంగా మంగళవారం బీసీ కాలనీకి చెందిన దైవజనులు యేసు రత్నం ఆధ్వర్యంలో బిసి కాలనీ త్రియేక దేవార్చనాలయం ఆవరణలో సుమారు నూట యాభై కుటుంబాలకు ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచిలు పూనమ్ సరోజిని,పులి సంతోష్, నరసమ్మ, ముత్యాల భవాని, ఎంపీటీసీ పూనం ప్రదీప్ చేతులమీదుగా నిత్యావసర సరుకులు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చ పాస్టర్ మాట్లాడుతూ మా కళ్ళముందే వరదలతో అనేక ఇబ్బందులకు పడుతున్న వారిని చూసామని వారికి ఎంతో కొంత సహాయంగా నిత్యవసరసరుకులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. దేవుడి కృప మా యందు ఉన్నంతవరకు ఎప్పుడు ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు. మానవతా దృక్పథంతో బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కుటుంబం చేసే సహాయ కార్యక్రమాలు చేస్తున్నందుకు ఆనందంగా ఉందని మునుముందు ప్రజలకు మరెన్నో సేవాకార్యక్రమాలు చేయాలని, ఆశ భావాన్ని వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో సిపి యం సీనియర్ జిల్లా నాయకులు పూనమ్ సత్యనారాయణ వెట్టి లక్ష్మి,రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ,సోయం చినబాబు, నల్లారపు ప్రకాష్ రావు,వైఎస్సార్ నాయకులు బొడ్డు సత్యనారాయణ, మోడెమ్ నరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బొర్రా గుహలు జిప్ లైన్ వివాదంపై సమగ్ర విచారణ

గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా జిప్ లైన్ నిర్మాణం స్థానిక సొసైటీల ద్వారా నిర్వహణ జరగాలి

విశాలాంధ్ర-అనంతగిరి : ప్రముఖ పర్యాటక కేంద్రం అయిన మండలంలో బొర్రా గుహలు వద్ద ఏర్పాటుచేసిన జిప్ లైన్ ఏర్పాట్లు లోటుపాట్లు ఉన్నాయని పలువురు ఫిర్యాదు మేరకు బొర్రా గేటు వలస గ్రామ సచివాలయం వద్ద సమగ్ర విచారణ నిర్వహించారు. ఈ గ్రామ సభను పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తుల ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ముఖ్యంగా విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక ఫిర్యాదు మేరకు ఈ జిప్పు లైన్ వివాదంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ కౌన్సిల్ బూసి వెంకటరావు మాట్లాడుతూ 1/70 యాక్టు పీసా చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో గిరిజనేతర్లు ఎటువంటి వ్యాపార కార్యక్రమాలు చేసేందుకు చట్ట వ్యతిరేకంగా పరిగణించబడుతుందన్నారు. అలాంటిది గిరినేతర వ్యక్తికి ఈ జిప్‌లైన్ నిర్వహణ ఏ విధంగా కట్టబెట్టారని ప్రశ్నించారు. తొమ్మిది నెలల కాలంలో సుమారు రెండు కోట్ల 59 లక్షలు కేవలం 65000 మాత్రమే పర్యాటకశాఖ చెల్లించడం ఎంత లొసుగులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచే స్థానిక సొసైటీలకు అప్పగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు అనంతరం సర్పంచ్ జన్ని అప్పారావు రావు మాట్లాడుతూ మొదట పర్యాటక శాఖ నుంచి అనుమతులు రాగానే ట్రైల్ రన్ కింద అనుమతులు ఇచ్చామని అనంతరం గ్రామసభ నిర్వహించి అనుమతి తీసుకోవాలని తెలుపమని అయినప్పటికీ నిర్వాహకుడు పట్టించుకోకపోవడం వల్ల జిప్ లైన్ మూత పడిందనే తెలిపారు ప్రజా వ్యతిరేకత ఎక్కువగా ఉన్నందున జిప్‌లైన్ నిర్వహణకు పంచాయతీ గ్రామసభ అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు అలాగే ఎంపిటిసి మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా ఇప్పటివరకు జిప్ లైన్ నిర్వహించి లాభాలు అర్జించే నిర్వాహకులు తిరిగి ఆ సొమ్మును చెల్లించాలని అనంతరం ఒప్పందాలు రద్దుచేసి స్థానిక సొసైటీలకు నిర్వహణ బాధ్యత అప్పగించి ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు చట్టబద్ధత కల్పించి ఇన్సూరెన్స్ వంటివి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి నగేష్, ఇన్చార్జి తాసిల్దార్ మాణిక్యం, ఆర్ఐ శంకర్రావు, కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, పీసా కమిటీ సభ్యులు రాంబాబు, డానియల్, మాజీ సర్పంచ్ ప్రసన్నకుమార్, గ్రామస్తులు సింహాద్రి, ధారు, నేలన్న, పొట్టి నిర్వహకుడు జస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

అర్థ జీతాలతో కాలం గడుపుతున్న ఐటీడీఏ టూరిజం కార్మికులు

ఐటీడీఏ అధికారులను నిలదీసిన సీఐటీయూ

విశాలాంధ్ర-జి.మాడుగుల : కొత్తపల్లి జలపాతం ఐటీడీఏ టూరిజం కార్మికులకు సీజన్లో తప్ప అర్థ జీతాలు ఇస్తున్నారని, సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్ ధ్వజమెత్తారు. మంగళవారం జి మాడుగుల మండలం,కొత్తపల్లి జలపాతంలో పనిచేస్తున్న ఆదివాసి ఐటిడిఏ టూరిజం వర్కర్ల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ మొత్తం మేనేజర్ సూపర్వైజర్లతో కలిపి 23మంది పనిచేస్తున్నారని, మేనేజర్‌కు, 15000 ఇస్తూ, ఈ మధ్యలోనే, మరో5000 కలిపి 20000 ఇస్తున్నారని, సూపర్వైజర్లకు 12000 ఇస్తున్నారని, వర్కర్లకు 8000 మాత్రమే ఇస్తూ అది కూడా నవంబర్ డిసెంబర్ జనవరి 3 నెలల్లోనే ఇస్తారని, సంవత్సరం అంతా అర్థ జీతమే 4000 ఇస్తారన్నారు. ఇది అన్యాయం కాదా అని ఐటీడీఏ అధికారులను నిలదీశారు. సంవత్సరానికి 40 లక్షలు పైగా ఆదాయం వస్తుందని, ఆదాయానికి తగ్గట్టుగా కార్మికుల జీతభత్యాలు ఇవ్వటం లేదని మండి పడ్డారు, రెండే బాత్రూంలు ఉన్నాయని సీజన్లో సరిపోవటం లేదని వాపోయారు, గేట్లు కూడా సరిగ్గా లేవని ఎన్నిసార్లు ఐటిడిఏ పిఓకు మొత్తుకున్నా చూద్దాం చేద్దాం అనటం తప్ప పట్టించుకోవడంలేదని ఆరోపించారు, కార్మికుల జీతాలు పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని, సీజన్లో కాకుండా మిగతా టైంలో కూడా జీతాలు ఐటిడిఏ సూచించినట్లుగా మొత్తం ఇవ్వాలని అర్థ జీతాలు ఇస్తే సహించేది లేదని,అధికారులకు హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, గడుతూరి సత్యనారాయణ, టూరిజం వర్కర్స్ సూపర్వైజర్లు, వంతల రాజు, వంతల అభి, వి రాము, కే నాగేశ్వరరావు, ఎస్ ప్రశాంత్, మీ శ్రీను, కే కృష్ణ బాబు, వి సురేష్ తోపాటు టూరిజం కార్మికులు పాల్గొన్నారు.

ముడుపులు ముట్టజెప్పితే ఓకే... లేదంటే తానాకే...

అటవీ శాఖ సిబ్బంది తీరు

విశాలాంధ్ర-దేవీపట్నం : అధికారుల కనుసన్నల్లో అక్రమార్కులు అడ్డగోలు గా అటవీ సంపదను తరలించేస్తుంటే అమ్యామ్యాలు చెల్లించని చిరు వ్యాపారులను మాత్రం తానాకే తరలించేసి కేసులు పెడుతున్నారు. పోలవరం ముంపులో రైత్వారీ కి చెందిన జీడిమామిడి మామిడి చెట్లను కుటుంబం గడుపుకోవటానికి రైతులు పుల్లను అమ్ముకుంటే దానికి కేసులు కడుతున్న అటవీ శాఖ అధికారులు కొద్దోగొప్పో చేతులు తడిపి వారి కనుసన్నల్లో మామిడి జీడిమామిడి మాటున మారుజాతిని తరలిస్తున్నా చోద్యం చూస్తున్నారు. ఎందుకంటే వారు కావాల్సినప్పుడు చేతులు తడుపుతారు కాబట్టి. మంగళవారం ఒక ట్రాక్టర్ తో తరలిస్తున్న జీడిమామిడి పుల్లను పజుల్లా బాడ్ సమీపంలో అటవీ శాఖ సిబ్బంది సీజ్ చేసి గోకవరం రేంజ్ ఆఫీస్ కు తరలించారు. పోలవరం ముంపు గ్రామాల్లో విలువైన అటవీ సంపద యదేచ్ఛగా సీతానగరం కోరుకొండ చిన కొండే పూడి వంటి ప్రాంతాలకు తరలిపోతుందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా ఏజన్సీ నుంచి అక్రమంగా తరలి పోతున్న కలప ను నిరోదించటానికి మండలం లోని ఉప్పయ్య పాలెం గ్రామంలో తనిఖీ కేంద్రం ఏర్పాటు చేసిన అటవీ శాఖ అధికారులు అనతికాలంలోనే మూన్నాళ్ళ ముచ్చటగా చెక్ పోస్ట్ ను తొలగించారు. దీంతో పోతవరం పోతుకొండ శరభవరం మీదగా అక్రమార్కులకు మార్గం సుగమం అయినట్లయింది. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.

అధైర్య పడవద్దు... అండగా మేముంటాం

జడ్పిటిసి సభ్యుడు బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో గాయపడి విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాయిపల్లి బాధితులు కొర్రా సుమిత్ర, కొర్రా పండన్న, కొర్రా కృష్ణ, కొర్రా సుబ్బారావులను మంగళవారం వైకాపా మండల కన్వీనర్ పాంగి గుణ బాబుతో కలసి బాలయ్య పరామర్శించారు. ఈసందర్భంగా బాధితులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.భాధితులకు అవసరమైన సర్జరీ నిర్వహించడం జరిగిందని వైద్యులు చెప్పారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులంతా ధైర్యంగా ఉండాలని, మీకు అండగా మేముంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. కేజీహెచ్ ఎస్ టి సెల్ సిబ్బంది తమను బాగా చూసుకొంటున్నారని, మంచి వైద్యం అందుతుందని బాధితులు జెడ్పీటీసీ బాలయ్య కు వివరించారు. సంఘటన జరిగిన వెంటనే కాలినడకన చట్రాయిపల్లి వచ్చి పరామర్శించడం జరిగిందని, మరలా అరకు ఎంపి తనుజారాణి, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు కే భాగ్యలక్ష్మి తో కలిసి చట్రాయి పల్లి గ్రామం రావడం జరిగిందని అన్నారు. మరలా ఈ రోజు విశాఖ వచ్చిన జెడ్పీటీసీకి ఈ సందర్భంగా బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్య క్రమంలో ప్రొఫెసర్ పసుపులేటి లక్ష్మణ్ రావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొర్రా బాబి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-కొమరాడ : మండలంలో ప్రతి పంచాయతీ ప్రతి గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మొదటి రోజు ఘనంగా ఎంపీడీవో ఎం మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో ఏం మల్లికార్జునరావు మాట్లాడుతూ కొమరాడ మండల కేంద్రంలో ఉన్న గ్రామ సచివాలయం నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీగా వచ్చి అనంతరం రహదారిపై మానవహారం నిరసించారు ప్రజా ప్రతినిదులు, అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళలు, వివిధ శాఖల సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని శ్రమదానం చేశారు. పల్లెలు, పట్టణాలు అని కాకుండా ప్రతీ ఒక్కరూ తమ గ్రామాలలో ఉండే చెత్తను స్వచ్ఛందంగా శుభ్రపరచారు. జిల్లా స్థాయి అధికారులు మండలాల్లో సందర్శించి ప్రజల నుండి సమస్యలను అడిగి ఎంపీడీవో తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ ఒకటో తేదీ వరకు అన్ని గ్రామపంచాయతీ గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టే ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమంపై ప్రజలందరూ అవగాహన పెంచుకొని ఈ కార్యక్రమం విజయ పదములో చేసేందుకు అధికారులు అంతా సక్రమంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఎం రాధాకృష్ణ ఏవో రమేష్, ఐసిడిఎస్ పిఓ సుగుణ ఎంఈఓ జై నారాయణస్వామి ఏపీవో బాలకృష్ణ వెలుగు ఏపీఎం వెంకటరమణ గ్రామీణ నీటి పారుదల విభాగం ఏఈ నవీన్ వైద్య ఆరోగ్యశాఖ గ్రామ సచివాలయం విద్యార్థులుసిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపైనా ఉంది

కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి నుండి ఆర్టీసి కాంప్లెక్స్ వరకు నిర్వహించిన స్వచ్ఛతాహీ ర్యాలీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్వచ్ఛ తాహీ కార్య క్రమం సెప్టెంబరు 1 నుండి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు ప్రతీ పట్టణంలోను పల్లెలోను జరుగుతోందని చెప్పారు. పరి శుభ్రత ఒక డిపార్టుమెంటు లేదా శానిటేషన్ వర్కర్లది మాత్రమే కాదని సామాజిక బాధ్యతగా పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన ఉండాలని అన్నారు. ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యవంతమైతే భారత దేశం పరిశుభ్ర దేశంగా మారి భారత ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయం నెరవేరుతుందన్నారు. జిల్లా లోని మూడు ఐటిడి ఏల పరిధిలో స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతీ కళాశాలలనోను, పాఠశాలల్లోను పరిశ్రభతకు కొంత సమయం కేటాయించాలని చెప్పారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా పరిశుభ్రతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె.

అభిషేక్ గౌడ్, ఐటిడి ఏ పి. ఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, మంత్రి లోకేష్‌తో పాడేరు, అరకు ఇంచార్జీలు

విశాలాంధ్ర-పాడేరు : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ను పాడేరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అరకు నియోజకవర్గం ఇంచార్జి సివేరి దోన్ను దొర అమరావతి సచివాలయ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఇటీవల కురిసిన భారీ వర్షాల గిరిజన ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో కొండ చరియాలు విరిగిపడి గిరిజనులు మృతిచెందడం అనేకమంది గృహాలు కూలిపోవడం, పంట పొలాలు సైతం ముంపుకు గురికావడంపై పళ్ళ శ్రీనివాస్ నారా లోకేష్ తో చర్చించారు. నష్టపోయిన బాధితులకు పరిహారం వీలైనంత త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అంతేకాకుండానియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యలపై వారి దృష్టికి తీసుకు వెళ్లినట్లు మీడియాకు వెల్లడించారు.

అక్షరజ్ఞానం లేని అజ్ఞాని... జగన్మోహన్ రెడ్డి

చదువు, పరీక్షలకోసం జగన్ మాట్లాడటం విడ్డూరం : మంత్రి గుమ్మిడి

విశాలాంధ్ర-సాలూరు: వైకాపా అధినేత పులివెందుల ఎమ్మెల్యే అయిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీబీఎస్ఈ బోధన రద్దు చేయడం పేదవారిపై వివక్ష అంటూ అడ్డగోలు ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు.ఏమి చదువుకున్నారో, ఎక్కడ చదువుకున్నారో తెలియని జగన్మోహన్ రెడ్డి, విదేశాలలో ప్రతిష్టాత్మక స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు నిర్ణయాలను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. లోకేష్‌ను విమర్శించే స్థాయి జగన్‌కి లేదన్నారు. సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయటానికి వీలుగా అనువైన వసతులు లేకుండా, సీబీఎస్ఈలో బోధించేందుకు ఉపాధ్యాయులకు ఎటువంటి శిక్షణ ఇవ్వకుండా పరీక్ష విధానం మార్చడం వలన పదోతరగతి చదువుచున్న 75వేల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ విషయంపై విద్యారంగ నిపుణులతో చర్చించి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని లోకేష్‌బాబు సరైన నిర్ణయం తీసుకున్నారన్నారు. రాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం జగన్మోహన్ రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. విద్యారంగంపై కనీస అవగాహనలేని జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. వేలాదిగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేయించిన ఘనత జగన్మోహన్ రెడ్డిది అన్నారు. టీచర్లను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టడం, మరుగుదొడ్ల ఫోటోలను అప్‌లోడ్ చేయమని ఒత్తిడికి గురిచేయడం వంటి పనులు చేపట్టిన జగన్మోహన్ రెడ్డి విద్యారంగం పై సలహాలు, సూచనలు అందించటం హాస్యాస్పదంగా ఉంటుందన్నారు.

వరద బాధితులకు ఏపీ రైతు సంఘం సాయం

విశాలాంధ్ర-పాలకొండ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు హార్దిక సహాయం మంగళవారం విజయనగరంలో జరిగిన ఏపీ రైతు సంఘం సమావేశంలోనగదు రూపంలో అందించడం జరిగింది, 7200 రూపాయలనురాష్ట్ర అధ్యక్షులు జి ఈశ్వరయ్య మరియు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ లకు ఈ మొత్తాన్ని ఇవ్వడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రకృతి విలయం ఏ రూపంలో ఏ విధంగా సంభవిస్తుందో చెప్పడం కష్టతరమని ఈ విపత్తులకు కారణంగా ప్రజలు మరియు పశు పక్షులు తీవ్ర సంక్షోభానికి గురవుతాయని గురుతాయని ఆవేదన వ్యక్తం చేశారు విజయవాడ లాంటి మహానగరం ఈ వరదల కారణంగా అతలాకుతలమైందని ఎవరికి తోచిన విధంగా వారు సహాయం అందిస్తున్నారని ప్రజల కోసం రైతుల కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఈ నేపథ్యంలోనే ఉడతా భక్తి సాయం అందించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కవులు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తి నాయుడు తదితరులు ఉన్నారు.

పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ బాధ్యతలు స్వీకారం

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా పనిచేసారు. అక్కడ నుండి బదిలీపై పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చేస్తానన్నారు. ఇంతవరకు ఇక్కడ ఆర్డీఓగా కే.హేమలత పనిచేసిన సంగతి తెలిసిందే.

జిల్లా రవాణా అధికారిగా దుర్గాప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా రవాణా అధికారిగా టీ దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా వ్యవస్థ చక్కగా నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇసుక రవాణాకు వాహనాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని, అదేవిధంగా రానున్న ధాన్యం సేకరణ సమయంలోను వాహనాల అవసరాన్ని ముందుగానే గుర్తించి తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర-సీతంపేట : మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సుమారు 500 మంది విద్యార్థులు చాలా ఉత్సాహంగా విద్యార్థులంతా పాల్గొని ఉన్నారు,ఈ క్రీడలలో ఉప విద్యాశాఖ అధికారి పాలక నారాయుడు, ఏటిడబ్ల్యూఓ మంగవేణి, సీతంపేట, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిడ్డిక. చంద్రావు, చూసి ఆనందించారు. ఈ ఎంపికలు క్రీడల పర్యవేక్షణ అధికారి జాకబ్ దయానంద్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం జరిగినది, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రావు, రమణ, సింహాచలం, హరినాద్,కళ్యాణ్, భాస్కర్, జగదీష్, శేఖర్,మొదలైనవారు హాజరైనారు, ఎంపికై క్రీడాకారులు నియోజకవర్గస్థాయి క్రీడలలో పాల్గొనసున్నారు.

స్వచ్ఛ భారతదేశం మన జిల్లా నుండే మొదలుకావాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : భారతదేశం స్వచ్ఛత వైపు అడుగులు వేస్తోందని, స్వచ్ఛ భారతదేశం మన పార్వతీపురం మన్యం జిల్లా నుంచే మొదలు కావాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 2 వరకు జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో సంపూర్ణ స్వచ్ఛ గ్రామం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. చెత్త రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ అన్నారు. స్వచ్ఛత కార్యకలాపాల స్ఫూర్తి స్వచ్ఛందత, శ్రమదాన్ లో భాగంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు, బీచ్‌లు, పర్యాటక ప్రదేశాలు, జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, అభయారణ్యాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, రివర్ ఫ్రంట్‌లు, ఘాట్‌లు, డ్రెయిన్‌లు, నల్లాలు మొదలైన జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలపై స్వచ్ఛతా సేవా కార్యక్రమం దృష్టి సారించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నుంచి పరిరక్షించుకోవచ్చని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ భారత్ నిర్మించాలనే బాపు కలను నెరవేర్చాలని జిల్లా వాసులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగస్తులు కలిసికట్టుగా పాల్గొని స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.టి జగన్మోహనరావు, ఎన్ జి ఓ సంఘం అధ్యక్షుడు జీవి ఆర్ ఎస్.కిషోర్, మున్సిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులు సిబ్బంది సేవా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహానుభావుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

ఎమ్మెల్యేలు బేబీ నాయన, జగదీశ్వరి, విజయచంద్ర

విశాలాంధ్ర-కురుపాం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు , మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు వంటి మహానుభావులు ఆశయాలు సాధనకు ప్రతి ఒక్కరూ క్రుషి చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, పార్వతీ పురం ఎమ్మెల్యే విజయచంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు.బుధవారం స్థానిక గాంధీ నగర్ సెంటర్ లో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ఏర్పాటు చేసిన అంబేద్కర్ మరియు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేశారు.ఈసందర్భంగా సమాజంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వారు చేసిన ప్రయత్నం, వారి ఆశయాలను కొనియాడారు.నేటి తరం రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు, విద్యావంతులైన యువత అంబేద్కర్, ఎన్టీఆర్ లను ఆదర్శంగా తీసుకుని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఘన సన్మానం : విగ్రహాలు ఆవిష్కరణ కు హాజరైన ఎమ్మెల్యే లు బేబీ నాయన, జగదీశ్వరి,విజయచంద్ర, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ దేవ్, వీరేష్ దేవ్‌లను గాంధీనగర్ యూత్ ఘనంగా సన్మానం చేశారు. మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ దేవ్, సంజనా దేవ్, మాజీ ఎంపీపీ జివిరమణమూర్తి,మండల కన్వీనర్ కెవి కొండయ్య,జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కద్రక మల్లేశ్వరరావు, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, నాయకులు పి.వెంకట నాయుడు, సంగి రెడ్డి మధుసూదనరావు,అక్కేన మధు,,బార్నాల సీతారాం, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గులిపిల్లి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కళాకారులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : వరద బాధితుల సహాయార్థం ఆదివారం స్థానిక లైన్స్ కళ్యాణ్ మండపంలో శ్రీ వాణిశివాని నాట్య కళామండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనలు చేపట్టారు.ఈ ప్రదర్శనలో కళాభిమానులు ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని అధ్యక్షులు బదే శ్రీరాముల నాయుడు, నాగిరెడ్డి, అమరాపు రామకృష్ణ, పెంట సత్యంనాయుడు, పల్ల హేమసుందర్ బాధితుల 1,0,0008.00 రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు అందజేశారు. నియోజకవర్గంలోని టిడిపి బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రూ.28 లక్షల విలువగల ఉపకరణాలు పంపిణీ

విశాలాంధ్ర-సీతంపేట/భామిని : ఆశావాహ బ్లాక్ లలో భాగంగా భామిని మండలంలో దివ్యాంగులకు రూ.28 లక్షల విలువ గల ఉపకరణాలను విభిన్న ప్రతిభావంతులు శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. నీతి ఆయోగ్ ఆశావాహ బ్లాక్ గా భామిని ఉండటం, దేశంలో 5 వందల ఆశావాహ బ్లాక్ లలో భాగంగా భామిని మండలంలో గత సంవత్సరం లబ్ధిదారులను గుర్తించడం జరిగింది. హైదరాబాద్ కు చెందిన అలింకో సంస్థ (ఏఎల్ ఐఎంసిఓ) దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాలు - బ్యాటరీ సైకిళ్లు, ట్రై సైకిల్స్, వినికిడి పరికరాలు, సెల్ ఫోన్లు, కృత్రిమ కాళ్ళు మొదలైన పరికరాలను ఇందులో భాగంగా పంపిణీ చేయడం జరిగింది. 147 మంది లబ్ధిదారులకు 28 లక్షల రూపాయల విలువ చేసే ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్, పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయ కృష్ణ, పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భామిని మండలం ఆశావాహ జిల్లాగా ఉండటం మంచి పరిణామం అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని ఆయన చెప్పారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీకి అవసరమగు మరిన్ని శిబిరాలు నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆశావహ బ్లాక్‌లో భాగంగా పనితీరును అనుసరించి మంచి ప్రోత్సాహకాలు అందుతాయని ఆయన చెప్పారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణ ప్రజలు సకాలంలో వారి ఆస్తి పన్నును మున్సిపాలిటీకి చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ కోరారు.కమిషనర్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి.నారాయణరావు వారి పరిధిలో గల గృహ యజమానుల నుంచి ఆస్తి పన్ను వసూళ్ల చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని 11వ సచివాలయ పరిధిలో గల సహస్ర తల్లి పిల్లల ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ జి వాసుదేవరావు 2024 25 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను సుమారు లక్ష 30 వేల రూపాయలను ఒకే విడతలో చెల్లించారని రెవెన్యూ ఇన్స్పెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్క యజమాని కూడా ఇదేవిధంగా సకాలంలో పన్నులు చెల్లిస్తే మున్సిపల్ అభివృద్ధికి సహకరించిన వారవుతారన్నారు.

ఘనంగా సామూహిక నూతన గృహ ప్రవేశాలు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని గెడ్డతిరువాడ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ గుంట్రెడ్డి తవిటమ్మ ఆధ్వర్యంలో సామూహిక గృహప్రవేశాలు ఘనంగా జరిగాయి. మంగళ వారం జరిగిన ఈకార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంచార్జి పిడి, జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ మంజూరైన ఇల్లు త్వరగా నిర్మించాలని లబ్ధిదారులను కోరారు.నిర్మాణాల త్వరగా పూర్తి చేస్తుంటే బిల్లులు అంత త్వరగా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. గెడ్డతిరువాడ పంచాయతీలో పిఎంఎవై గ్రామీణ పథకం ద్వారా 40 ఇల్లు మంజూరయ్యాయని, ఇందులో 11 ఇల్లు పూర్తయ్యాయని వీటిని వేదమంత్రాల నడుమ సామూహిక గృహప్రవేశం తర్వాత వారికి హక్కు పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డిఈ ఎన్ వెంకటరావు, ఏఈ ఈఎల్ ఉమామహేశ్వర రావు, డిప్యూటీ తహ శీల్దార్ డి .ఫకీరు, పంచాయతీ టీడీపీ లీడర్ ఎం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరంలో స్వచ్ఛత ర్యాలీ

విశాలాంధ్ర-వై.రామవరం: స్వచ్ఛత హి సేవా కార్యక్రమం లో భాగంగా మంగళవారం వై.రామవరం లో ఎంపీడీవో కె.బాపన్న దొర ఆధ్వర్యం లో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో వాలని, కలుషిత నీటిని త్రాగ రాదని, నీటిని శుద్ధి చేసుకుని త్రాగాలనీ, వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. బస్ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు జరిగే ఈ స్వచ్ఛత హి సేవా కార్యక్రమం లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. కార్యక్రమం లో ఎంపీపీ కడబాల ఆనందరావు, జడ్పిటిసి కర్రా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సుభలక్ష్మి, విపీఎం సాయిబాబు, పంచాయితీ కార్యదర్శులు మధుసూదన రాజు, లోవరాజు, సచివాలయం సిబ్బంది, ప్రిన్సిపాల్ ఈశ్వర కృప, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన శాలివాహన వినాయక చవితి వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోని కుమ్మరివీదిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగి మంగళవారం పెద్ద ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని శాలివాహన సంఘం నాయకులు తెలిపారు.సాయంత్రం నిమ్మజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-చింతూరు : భారత ప్రధాని నరేంద్ర మోడి పుట్టినరోజు సందర్భంగా చింతూరు గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ లో మంగళవారం రోగులకు పళ్ళు రొట్టేలు సుమారు 250 మంది రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గత 10 ఏళ్లుగా నరేంద్ర మోడీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో చింతూరు బీజేపీ మండలం అధ్యక్షులు డి వి యస్ రమణా రెడ్డి (చిట్టిబాబు), కోట్ల వెంకన్న, మూట మల్లేష్, మీడియం ప్రసాద్, పొడియం నాగార్జున, పొడియం పోదయ్య, మడివి నగేష్ శ్యామల లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెదంకలం పిహెచ్‌సి ఆధ్వర్యంలో డి వార్మింగ్

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పెదంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం నాడు డి వార్మింగ్ కార్యక్రమాన్ని మండలంలోని 31 అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు, 25 పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు అందజేయడం జరిగిందన్నారు. 1987మంది పిల్లలకు డివార్మింగ్ వేయడం జరిగిందని సిహెచ్‌ఓ సూర్యనారాయణ తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలో సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొని కార్యక్రమం చేపట్టారని తెలిపారు.

రాష్ట్ర పర్వదినంగా విశ్వకర్మ జయంతి

విశాలాంధ్ర-చింతపల్లి : విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పర్వదినంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు లక్కోజు నాగభూషణం అన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులో అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ శౌర్య మాల్ పటేల్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ తిదేపా రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కోఆర్డినేటర్ బీసీ విశ్వబ్రాహ్మణ సాధికార సమితి సింహాద్రి కనకాచారి కృషి ఫలితంగా విశ్వబ్రాహ్మణ జాతీయులను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పర్వదినంగా జరుపుకునే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. బీసీ విశ్వబ్రాహ్మణ సాధికారిక సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ సింహాద్రి కనకాచారి, కన్వీనర్ గోడి నరసింహచారి, కాకుమాను వెంకట వేణు, సోషల్ మీడియా స్టేట్ కో ఆర్డినేటర్, ఇతర సాధికారిక రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంటరీ కన్వీనర్లు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌లకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం చింతపల్లి సభ్యులు చుక్కా సత్యనారాయణ, వేమవరపు సూరిబాబు, నవర గోవింద్, వేమవరపు సత్తిబాబు, తగరంపూడి తాతారావు లు పాల్గొన్నారు.

పార్వతీపురం : విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మ ద్వారకానగరి వంటి నగరాలు నిర్మించినట్లుగా పురాణాలు తెలియజేస్తున్నాయని, అటువంటి మహనీయుని స్మరించుకొని పూజించుకోవడం మన అదృష్టమని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవనాయుడు, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి ఎం.సావిత్రి, సూపరింటెండెంటు శ్రీరామ్మూర్తి,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : చింతూరులో విశ్వకర్మ జయంతి ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో జగ్గురువు పోతులూరి విరబ్రహ్మేంద్ర స్వామివారి చిత్రపటానికి పుష్పల తో అలంకరించిన పురోహితులు వలబోజుల మహేష్ వేదమంత్రాల నడుమ విశేష పూజలు నిర్వహించి విశ్వకర్మ కు హారతులిచ్చి ఘనంగా పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విశ్వాబ్రాహ్మణులచే మంత్రపుష్పం పటింపజేసి స్వామివారి పాదాలకు శిరస్సు వంచి మనస్ఫూర్తిగా నమస్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం కుల పెద్దలు ఆకోజు నూకాచారి, వలబోజుల జోగేశ్వరరావు, ఆకుపాటి సన్నీ బాబు, వనమోజు శ్రీనివాస్, ప్రసాద్, కారంపూడి కాంతారావు, రమేష్, మునగంటి భాస్కరాచారి, బెజ్జంకి ఈశ్వరాచారి, బెజ్జంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవాను దిగ్విజయంగా నిర్వహించండి

జిల్లా పంచాయతీ అధికారి రామచంద్రరావు

విశాలాంధ్ర-సీతానగరం : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంను దిగ్విజయంగా నిర్వహించే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని జిల్లా పంచాయతీ అధికారి కె .రామచంద్రరావు పిలుపునిచ్చారు. మండలంలోని పెదబోగిలి గ్రామపంచాయతీలో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అక్టోబర్ 2 వరకు నిర్వహించాలన్నారు. సంపూర్ణ స్వచ్ఛ గ్రామప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. చెత్త రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నుంచి పరిరక్షించుకోవచ్చని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం కోసం రోజుకో కార్యక్రమం చొప్పున నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలన్నారు. 14రోజులుపాటు చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, వ్యాపారవేత్తలు కార్యక్రమములో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తేరేజమ్మ, కార్యదర్శులు రమేష్, సుధారాణి పాఠశాల విద్యార్థులు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని 35 గ్రామ పంచాయతీలో సర్పంచులు కార్యదర్శిలు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రతిజ్ఞలు నిర్వహించారు.

పాఠశాల విద్యార్థులకు కొనసాగుతున్న నేత్ర పరీక్షలు

విద్యార్థులందరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలి
జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డా. సుకుమార్‌బాబు

విశాలాంధ్ర-బెలగాం : రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 1వ తేదీ నుండి అక్టోబర్ 31వ తేదీ వరకు జరగనున్న పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వున్న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లా అందత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి డా. జీరు నగేష్ రెడ్డి పర్యవేక్షణలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వ్కెద్య అధికారులు, నేత్ర వ్కెద్య సహాయకులు ద్వారా నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డా. సుకుమార్ బాబు తెలిపారు. 3సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 34,550 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేసి 1,022 మందికి దృష్టి దోషం వున్నట్లు గుర్తించామని, ఈ విద్యార్థులకు ప్రభుత్వం త్వరలో ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేస్తామని అలాగే నేత్రాలకు సంబంధించి ఎటువంటి శస్త్ర చికిత్సలు అవసరమైతే వారికి ఉచితంగా ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. దృష్టి దోషం వుండి కళ్లజోళ్లు వాడుతున్న విద్యార్థులకు మరల నేత్ర పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మెల్లకన్ను మరియు గాయాల వలన వచ్చే కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు కోసం పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు నులిపురుగుల మందులు మింగించుట

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని హైస్కూల్ నందు, రేఖపల్లి గ్రామంలో కస్తూరి బాయ్, మినీ గురుకులం, అంగన్వాడి సెంటర్లు వివిధ పాఠశాలల్లో ఎంపీపీ కారం లక్ష్మి ప్రజాప్రతినిధులతోపాటు సిపిఎం బృందం మంగళవారం వారి చేతులమీదుగా విద్యార్థులకు నులి పురుగులు మందులు మింగించడం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధులు బారిన పడకుండా ఉండాలని, విద్యార్థులు చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని వారికి బలమైన పోషకాహారం అందించాలని, అప్పుడు విద్యార్థులు చదువుల పట్ల శ్రద్ధ చూపిస్తారని విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రామవరం, సర్పంచ్ కారం. బుచ్చమ్మ, పెద్ద మట్టపల్లి సర్పంచ్ వెట్టి. లక్ష్మి, వి ఆర్ పురం సర్పంచ్ సోడి. నరసమ్మ, సిపిఎం జిల్లా నాయకులు పూనెం. సత్యనారాయణ మండల కార్యదర్శి సోయం. చిన్నబాబు, సోడి, మల్లయ్య, వీర్ల. నాగేశ్వరావు, సిహెచ్. సుబ్బారావు, ప్రకాష్ రావు, రేఖపల్లి వార్డ్ నెంబర్ కృష్ణవేణి, వి ఆర్ పురం హై స్కూల్ హెచ్‌ఎం బాబురావు, మినీ గురుకులం సిబ్బంది, కస్తూరిబాయ్ సిబ్బంది, అంగన్వాడి సెంటర్ సిబ్బంది ఏఎన్ఎం ఆశా వర్కర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : విద్యార్థులు తమ ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు వహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.రాజు అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా ప్రిన్సిపాల్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఆశా వర్కర్ అలివేలు విద్యార్థిని విద్యార్థులకు ప్రతి ఒక్కరికి నులిపురుగుల గురించి వివరించి దానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాటికి సంబంధించిన టాబ్లెట్స్ విద్యార్థులకు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ సీనియర్ అసిస్టెంట్ అతిధి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకే మణిహారం 'జి.తాటివాడ'

బడి గుడి కమ్యూనిటీ హాల్‌నే.. ప్రమాదాలకు నెలవు ఇరువైపులా చప్టాలు
గోడు పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన

విశాలాంధ్ర-దేవీపట్నం : మండలానికి సుదూరంగా ఉన్న డి ఎన్ పాలెం పంచాయతీ లోని చిన్న కుగ్రామం జి తాటివాడ.గ్రామాన్ని అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. సుమారు 40-60మధ్య కుటుంబాలు ఉన్న పూర్తి గిరిజన గ్రామం. అయినా గిరిజనుల కోసం నెలకొల్పిన ఐటిడిఏ వీరికి అందించే సహాయ సహకారాలు అంతంత మాత్రమే. గ్రామంలో చిన్నారులకు ఉన్న భవనం శిధిలం కావటంతో విఎస్ఎస్‌కు చెందిన రేకుల షెడ్ లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు గ్రామానికి ఇరువైపులా రోడ్డు లో చప్టాలు నాచు పట్టి ప్రమాదభరితం మారటంతో నిత్యం అదే రహదారి మార్గం గూండా రాకపోకలు సాగించే డి ఎన్ పాలెం పంచాయతీ లోని డి ఎన్ పాలెం, కొత్త గూడెం, ములకల గూడెం గ్రామాల ప్రజలు నిత్యం ఇదే రహదారి లో రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇటీవల వర్షాలకు చెప్టా కు పడిన గోతులతో నాచు పట్టి మనుష్యులు వాహనాలు కూడా ప్రమాదాలకు గురుతున్నాయని గ్రామస్తులు కలుం బాపన్న దొర కారం గంగన్న దొర కారం బాపిరాజు కలుం పండుదొర లు ఎన్నిసార్లు ఉన్నతధికారులకు విన్నవించుకున్న పట్టించుకునే వారు లేరని గ్రామస్తులు వాపోతున్నారు. వీధి లైట్లు పనిచేయక రాత్రి అయితే విష పురుగులు మధ్య బిక్కుబిక్కు మంటూ భయం భయం గా గడుపుతున్నామని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇంకో గమ్మత్తు విషయం ఏమిటంటే మండల పరిషత్ కు గత ప్రభుత్వం లో వైస్ ఎంపిపి గా ఈ గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యుడే ఉండడం గమనార్హం. మండలానికి మండల కేంద్రానికి విసిరేసినట్టు ఉండే ఈ గ్రామం అభివృద్ధి కి ఆమడ దూరంలో ఉంది. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా తమ దుస్థితి మారదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

స్వచ్ఛ భారత్‌కు సహకరిద్దాం : ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లాలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని, స్వచ్ఛ భారత్ కు సహకరిద్దామని ఎమ్మెల్యే విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన పార్వతీపురం పట్టణ నాలుగు రోడ్ల కూడలి వద్ద పార్వతీపురం మండలం సంగంవలస గ్రామంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు చేపట్టి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెత్త ఎక్కడి నుంచి తయారు కాదు మన ఇంటి నుంచే వస్తుంది కాబట్టి ఆ చెత్తను బయట పారబోసి అధ్వానంగా పరిసరాలు తయారు చేయవద్దని ఆయన కోరారు.ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు ఎదురవుతుంది ప్రతి ఒక్కరు దానిని వినియోగించుకున్న ఉండాలని ఆయన అన్నారు. చెత్తను సంపదగా సృష్టించుకుంటే పరిసరాలు బాగుపడడంతో పాటు మంచి ఆరోగ్యం సొంతమవుతుందన్నారు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛత కార్యక్రమాలు అక్టోబర్ 2 వరకు చేపట్టాలని సూచించిందని 15 రోజులు కార్యక్రమం కాకుండా ప్రతిరోజు ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను. గౌరీశ్వరి కమిషనర్ కె.శ్రీనివాసరావు,బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఉద్యోగులు,పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను వైద్యులు సందర్శన

విశాలాంధ్ర-బెలగాం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డీ వార్మింగ్ డే - ఎన్.డి.డి) సందర్భంగా జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం (ఆర్.బి.ఎస్.కె-డిఈఐసి) ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి ఫిజియోథెరపీ వైద్యులు డా. ఎద్దు లక్ష్మీనారాయణ, సైకాలజిస్టు డా. ఉదయ్ కుమార్ మంగళవారం పార్వతీపురం మండలం ఎంఆర్ నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు డీ వార్మింగ్ డే యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్పి కె. నందిని, ఎఎన్ఎం డి. పోలమ్మ, హెల్త్ అసిస్టెంట్ సిహెచ్ కన్నంనాయుడు, ఎంఆర్ నగరం జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు ఎన్.ఎస్ వికాస్, ఆశాలు డి. సాయమ్మ, బి. చినతల్లి, సి.హెచ్.డబ్ల్యూలు పి. పైడితల్లి, పి. సుజాత, ఆర్. దమయంతి, సబిత పాత్రో, బి.గణపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్న సంతర్పణ

విశాలాంధ్ర-చింతూరు : చింతూరులోని సాయిబాబా ఆలయంలో వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వలబోజుల మహేష్ పూజలు నిర్వహించారు. అనంతరం నవరాత్రుల సందర్భంగా అన్నదానం (అన్న సంతర్పణ) చేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చమని గణనాథుని వేడుకొన్నారు. అనంతరం అన్న సంతర్పణలో భారీ సంఖ్యలో పురుషులు,మహిళ భక్తులు, పాల్గొన్నారు. ఆలయ కమిటీ అన్న సందర్భంగా కావలసిన ఏర్పాట్లు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి



విశాలాంధ్ర-సీతంపేట : స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా 17 సెప్టెంబర్ నుండి అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో పరిశుభ్రత మరియు ఆరోగ్యవంతమైన గ్రామాల కోసం అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. మెయిన్ రోడ్ కూడలి వద్ద మానవహారం నిర్వహించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ నారాయణ, ఏఎంఓ కోటి, జిసిడిఓ రాములమ్మ ఎంఈఓ ఆనందరావు, ఈవో పీ ఆర్ అండ్ ఆర్డి సత్యం, సీతంపేట, పెదరామ, దేవనాపురం, పెద్దూరు సచివాలయాల నుంచి పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది. జిటిడబ్ల్యూగర్ల్స్, బాయ్స్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు కూడా ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు, వార్డెన్ ఆరోపణలపై దర్యాప్తు

విశాలాంధ్ర-కొమరాడ : మండలంలో ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వార్డులపై వస్తున్నారు పై దర్యాప్తు నిర్మించినట్లు డిడి రుగ్మంగదాయ్య అన్నారు. మంగళవారం ఉలిపిరి ఆశ్రమం పాఠశాలలో అధికారులతో కలిసి దర్యాప్తు నిర్మించారు. ఉదయం పాఠశాలకు తల్లిదండ్రులు చేరుకొని చదువుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో ఇక చదివించమో పిల్లలకు ఇబ్బందులు పెడుతున్నారు టీసీలు తీసుకువెళ్లిపోతామని రావడంతో ఒకసారి గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో తక్షణమే స్పందించిన అధికారులు మండల స్థాయి అధికారులకు పిలిపించి విద్యార్థులు తల్లిదండ్రులు గిరిజన సంఘాలు నేతలు ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి అధికారులు మాట్లాడారు. పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డిడి ఒక్కొక్క సిబ్బందిని పిలిచి మాట్లాడారు వారి వివరణ తీసుకున్నారు. అనంతరం స్కూల్ కమిటీ చైర్మన్ విద్యార్థుల తల్లిదండ్రులు కలిగే గిరిజన సంఘాల నేతలతో మాట్లాడి సమస్యను పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధానోపాధ్యాయులు వార్డెన్లను మార్చేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రధానోపాధ్యాయులను వార్డుల మార్చి విద్యార్థినీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా భోజనాలు విద్యాబోధనలో అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ దర్యాప్తులో ఎంపీడీవో మల్లికార్జునరావు, డిప్యూటీ తాసిల్దార్ శివయ్య ఎస్సై కేనీలకంఠం ఏ టి డబ్ల్యూ సురేష్ కుమార్,ఉపాధ్యాయులు గిరిజన సంఘం నాయకులు విద్యార్థి సంఘ నాయకులు విచారణలో పాల్గొన్నారు.

రక్తహీనతతో కూడిన అనారోగ్యాలకు చిన్నారులు దూరంగా ఉండాలి

ఘనంగా నులిపురుగుల దినోత్సవం

చిన్నారుల చేత నులిపురుగుల మాత్రలు మింగిస్తున్న సిడిపిఓ రమణి, వైద్య సిబ్బంది.

విశాలాంధ్ర-చింతపల్లి : రక్తహీనతతో కూడిన అనారోగ్యాలకు చిన్నారులు దూరంగా ఉండాలంటే ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు వరకు ఏడాదికి రెండుసార్లు నులిపురుగుల (ఆల్బెండజోల్) మాత్రలు విధిగా వేసుకోవాలని స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ జి వెంకటరమణి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్ల అంగన్వాడి కేంద్రం, మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఎం ఎల్ హెచ్ పి లక్ష్మి, ఏఎన్ఎం కోపూరు విజయలక్ష్మి ల ఆధ్వర్యంలో నులిపురుగుల మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు అన్నం తినే ముందు, కాల కృత్యాలకు వెళ్లినప్పుడల్లా కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని చిన్నారులకు సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన కడుపులో ఉండే నులిపురుగులు చనిపోతాయని, తద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఉండగలుగుతారన్నారు. నులిపురుగులు మాత్రలు ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు వేసుకోవడం వలన నిరంతరం ఆరోగ్యవంతులుగా ఉండడానికి అవకాశాలు ఉంటాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడకపోతే చిన్నారులలో రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండుసార్లు ఈ మాత్రలు వాడాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త తూబెరి నూకరత్నం, అంగన్వాడి కార్యకర్త పుట్టపల్లి నాగరత్నం, అంగన్వాడి ఆయా రామతల్లి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల్లో పీసీఓఎస్ సమస్యకి సరైన పోషకాహారంతో చెక్

విశాలాంధ్ర-పాడేరు : భారతదేశంలో చాలా మంది మహిళలను ప్రభావితం చేసే పాలిసిస్టిక్ ఓవరీ సింప్రోమ్ (పీసీఓఎస్) గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి మరియు అర్థం చేసుకోవటానికి సెప్టెంబర్‌లో పీసీఓఎస్ అవేర్‌నెస్ నెలను జరుపుకుంటారని ప్రముఖ న్యూట్రిస్టిస్ట్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణమూర్తి అన్నారు. పీసీఓఎస్ మాసం సందర్భంగా మహిళల్లో పీసీఓఎస్ సమస్యపై ఓ హోటల్ లో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ పీరియడ్స్ సరిగా రాకపోవటం, మగ హార్మోన్ల స్థాయిలు అధికంగా ఉండటం, అండాశయంలో తిత్తులు వంటి లక్షణాలతో కూడిన పీసీఓఎస్ కారణంగా బరువు పెరగడం, మొటిమలు, అవాంఛిత రోమాలు సంతానోత్పత్తి సమస్యలు వంటి లక్షణాలకు దారి తీస్తుందన్నారు. అవసరమైన పోషకాలను అందించే బాదం, ఆకు కూరలు, పప్పులు తృణధాన్యాలు వంటి సహజ ఆహారాలను చేర్చడం చాలా ఉత్తమమన్నారు. బాదంపప్పులు వాటి ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు ఫైబర్ కారణంగా ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. బరువు నిర్వహణలో సహాయపడతాయి. అదనంగా, బాదం మెగ్నీషియంను అందిస్తుందని, ఇది రక్తంలో చక్కెర నియంత్రణలో తనవంతు పాత్ర పోషిస్తుందన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసిఎంఆర్-ఎన్ఐఎన్) బాదం వంటి పోషకమైన గింజలను ప్రతిరోజు తీసుకోవడం సూచిస్తుంది అన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సల కోసం తరలింపు

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలపరిధిలో వున్న సచివాలయంల పరిధిలో వున్న గ్రామాలలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిభిరంలలో అలానే ముఖ్యమంత్రి నేత్ర కేంద్రంలలో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షలలోకేటరాక్ట్ (అంతర కుసుమం) టేరిజియం (కొయ్యకండ) వున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం ఈ రోజు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి పుష్పగిరి కంటి ఆసుపత్రి, విజయనగరంకి తరలించి రేపు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు.వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్ళ జోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలు కు వెళుతున్న రోగులకు పలు సూచనలు, జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మా లాంటి పేదలకు కంటి చూపును తెప్పించే బాధ్యతగా తీసుకొని మాకు దగ్గర వుండి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న జిల్లా అందత్వ నివారణ సంస్థకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు మాలిక, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొండెంఖల్‌లో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ

విశాలాంధ్ర-కురుపాం : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో మొండెంఖల్ పంచాయతీ, సర్పంచ్ ఐ.గౌరీశంకర్, సెక్రెటరీ వెంకట్ నాయుడు ఆద్వర్యంలో జడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి మంగళవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరూ స్వచ్ఛత పాటించాలని కోరారు. పారిశుధ్యం ప్రాముఖ్యత ప్రజలకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు. ప్రసాద్. ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ పాఠశాల, కృష్ణారావు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ డిపార్ట్మెంట్ భారతి, ఉపాధి సిబ్బంది సచివాలయం సిబ్బంది స్కూల్ పిల్లలు గ్రామస్తులు

గంజాయి సాగు రహితమే అందరి లక్ష్యం

కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : జిల్లాలో గంజాయి సాగు రహితమే అందరి లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గంజాయి సాగు నిర్మూలన పై అధికారులకు దిశా నిర్దేశం చేసారు. గంజాయిని సాగు చేసినా , అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఐసిడిఎస్, డ్వామా, డి. ఆర్. డి. ఏ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గంజాయి సాగుపై ఫిర్యాదుల స్వీకరణకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖలలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలో గంజాయి వినియోగంపై కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కళాశాలల్లో అవగాహనా సదస్సులు, డి ఎడిక్షన్ సెంటరుకు ఎంత మంది వచ్చారని సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులుపై ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకలను మంజూరు చేయాలని స్పష్టం చేసారు. జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ సమావేశం రోజున గంజాయి వినియోగం వలన వచ్చే ఆరోగ్య సమస్యలపై చర్చించాలని సూచించారు. డి.ఐ.జి గోపీ నాథ్ జెట్టి మాట్లాడుతూ జిల్లాలో గంజాయిని సమూలంగా అరికట్టాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ నిరుద్యోగం ఎక్కువగా ఉందన్నారు. యువతకు స్వయం ఉపాధి పథకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించవలసిన అవసరం ఉందన్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ గంజాయి సాగును విడిచిపెట్టిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ అదనపు ఎస్పీ ధీరజ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించాలి

- అరకులోయ ఫుట్ పాత్ ఆక్రమణ షాపులను వెంటనే తొలగించాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

విశాలాంధ్ర-అరకులోయ : మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు గిరిజన అభివృద్ధికి అంకితభావంతో విధులు నిర్వహించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. అరకులోయలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై చర్చించే సర్వసభ్య సమావేశంలో కొంతమంది అధికారులు రాకపోవడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చూచాయిగా కిందిస్థాయి అధికారులను పంపించి చేతులు దులుపుకుంటే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఆయన ప్రశ్నించారు. అరకులోయలో ఫుట్‌పాత్ లు ఆక్రమణకు గురి కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న అధికారులు చూస్తూ మౌనవమించడం తగదని ఆయన అన్నారు. అరకులో టౌన్ షిప్లో గిరిజనులకు ఎన్ని షాపులు ఉన్నాయి అధికారులు చెప్పాలని ఆయన ప్రశ్నించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు నిరుద్యోగులకు ఎవరు కేటాయిస్తే వారే వ్యాపారం చేసుకోవాలని గిరిజ నేతరులకు కట్టబెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పద్మాపురం పంచాయతీలో ప్రభుత్వ భూములు ఎక్కువగా అన్యక్రాంతమవుతున్నాయని అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని అధికారులు చేతివాటం తీసుకోవడం వల్లే అక్కడ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు. అక్రమ నిర్మాణదారులకు అనుమతులు ఎవరిస్తున్నారని అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ చేయాలని ఆయన అన్నారు. పంచాయతీ సెక్రెటరీలు డబ్బులు తీసుకోవడంవల్ల అక్రమ నిర్మాణాలు పెరిగిపోతుందన్నారు. అలాగే మెయిన్ రోడ్ లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మండల పరిషత్ దుకాణ సముదాయాన్ని వెంటనే రిటెండర్ పిలిచి కొత్త నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని గతంలో టెండర్ వేసినప్పటికీ, అవి గిరిజనేతరుల ఆధీనంలో ఉన్నాయని ఆయన అన్నారు. వాటిని వెంటనే ఖాళీ చేయించి కొత్త నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలని ఆయన ఎంపీడీవోను ఆదేశించారు. అరకులోయ ప్రాంతంలో పేరుకే పర్యాటక కేంద్రం ఉందని పర్యాటక శాఖ, రిసార్ట్స్, అతిథిగృహాలు, హోటల్లు నుంచి కనీసం పన్నులు కూడా పంచాయతీ కట్టలేని స్థితిలో ఉంటుందని ఇప్పటికే పర్యాటక శాఖ నుంచి పెదలబుడు పంచాయతీకి వచ్చే బకాయి పన్ను ఒక కోటి 86 లక్షల రూపాయలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పర్యాటకశాఖ గేట్లు మూసివేతకు పంచాయతీ చేసే ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు తీస్తామన్నారు. కోట్లాది రూపాయలు ప్రతి ఏట వ్యాపారం చేసుకునే పర్యాటక శాఖ కనీసం పంచాయతీకి చెల్లించవలసిన పనులు కూడా చెల్లించకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. అరకులోయలోని లాడ్జిల్లు హోటల్ యజమానులు పర్యాటకులకు అధిక రేట్లకు ఇచ్చి మోసం చేస్తున్నాయని ప్రతి లాడ్జిల్లో ఫిక్స్ రేటు పెట్టాలని, హోటల్స్ లో నాణ్యమైన భోజనాలు పెట్టాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ఎంపీపీ, జడ్పీటిసి, నిధుల నుంచి కొంత అరకులోయ అభివృద్ధికి కేటాయించాలని ప్రజలకు పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు కోరారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా నుంచి ఎండపల్లి వలసలో సిసి రోడ్ల నిర్మాణంలో ఇల్లులు లేని చోట్ల గిరిజన నేతరులు నివాసం ఉండే చోట్ల వ్యక్తిగత ఇళ్లల్లో ఎలా రోడ్లు నిర్మించారని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాటు ఎంపీటీసీలు దుర్య ఆనంద్ కుమార్, పెదలబుడు ఎంపీటీసీ ఎల్బీ బీమరాజు తదితరులు ప్రశ్నించారు. గ్రామాల్లో సిసి రోడ్లు వేయడానికి కాంట్రాక్టు లేదని కుంటి సాకులు చెప్పే అధికారులు వ్యక్తిగత ఇళ్లల్లో రోడ్డు వేయడానికి కాంట్రాక్టర్లు ఎలా దొరుకుతున్నారని వారు ప్రశ్నించారు. ఎండపల్లి వలసలు జరిగిన సిసి రోడ్ల పనులకు బిల్లులు చేస్తే ఒప్పుకోలు అనేది లేదని ఎంపీటీసీలు హెచ్చరించారు. సుంకరమెట్ట పంచాయతీలోని దండపాడు, కినంగూడలో ట్రాన్స్ ఫార్మర్ల సమస్య వెంటనే పరిష్కారం చేయాలని సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్ గెమ్మెలి చినబాబు అన్నారు. దాబుగూడ లో కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అరకులోయలో వివిధ వీధుల్లో పెరిగిపోతున్న చెత్తాచెదరాలు వెంట వెంటనే తొలగించాలని రాత్రి వేళలో పోలీస్ శాఖ సినిమా హాల్ జంక్షన్ అరకులో ముఖద్వారం ఎన్టీఆర్ గార్డెన్ వద్ద నిఘవేయాలని అనేకమంది మద్యం,గంజాయి తాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జడ్పీటిసి శెట్టి రోషిని అన్నారు.

ఉత్సవ్ విగ్రహంలో ఎంపీపీ : మండల సర్వసభ సమావేశానికి అధ్యక్షత వహించవలసిన ఎంపీపీ మౌనం దాల్చి విగ్రహ ఉత్సవం లా కనిపించడం పలు విమర్శలకు తావిస్తోంది. సమావేశం లో కనీసం ఎంపీపీ ఉషారాణి మాట్లాడకపోవడం గమనార్హం. ఎంపీపీ అధ్యక్షత వహించవలసిన సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాత్రమే చివరి వరకు అధ్యక్షత వహించడం పలు విమర్శలకు తావిచ్చింది. ఇలా చేయడం ఎంపీపీకి అవమానించినట్లేనని పలువురు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజపల్లి ఉషారాణి, జడ్పీటిసి శెట్టి రోషిని, వైస్ ఎంపీపీ రామన్న, వివిధ శాఖల అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గేట్లు తెరవండి... మీలాంటి స్వార్థపరులే పార్టీని వీడుతారు

మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర-సాలూరు : తెదేపా వారు గేట్లు తెరిస్తే వైకాపా లో ఏ ఒక్కరూ ఉండరని తెదేపా పట్టణపార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు(చిట్టి) అనడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అన్నారు.మంగళవారం తన నివాసంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ గతంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి తన వద్దకు వివిధపనుల నిమిత్తం వచ్చారన్నారు.అంగన్‌వాడీ ఉద్యోగం తోపాటు అర్బన్,రూరల్ లో పలు కాంట్రాక్టర్ పనులు అడిగి తీసుకున్నారన్నారు.ప్రత్యర్థి పార్టీల వారి దగ్గరకు స్వలాభం కోసం మీలాంటి వారే చేరుతారని అన్నారు.వైకాపా బలంగా ఉందని ప్రజానాయకులు ఎవరూ పార్టీ ని వీడరని పేర్కొన్నారు.సాధారణ కుటుంబం నుండి వచ్చిన తాను నాలుగు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యే గా ఎన్నిక అయ్యానన్నారు.భవిష్యత్ లో కూడా వేరెవరు సాలూరు నియోజకవర్గం నుండి వరుసగా ఎన్నిక కాలేరన్నారు.అటువంటి చరిత్ర ఉన్న తనలాంటి నాయకుడిని విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు.

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అశుతోష్ శ్రీవాత్సవ మంగళ వారం కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు మంచి సేవలు అందించి మన్ననలు పొందాలని సూచించారు.

జిల్లా ఎస్పీను మర్యాద పూర్వకంగా కలిసిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అశుతోష్ శ్రీవాత్సవ మంగళ వారం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డిను జిల్లా పోలిస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు మంచి సేవలు అందించి మన్ననలు పొందాలని సూచించారు.

శ్యామలాంబ పండగను గ్రామ పెద్దలు జరిపించాలి

- ప్రజా ప్రతినిధులు సహకరించాలి
- నిధుల సమస్య లేకుండా మూడు శాఖల నుండి డబ్బు రప్పిస్తానని నాడు తెలిపాను
- మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర:-సాలూరు : సాలూరు ప్రజల ఆరాధ్య దైవం శ్యామలాంబ అమ్మ వారి పండగను జరిపించే బాధ్యత సాలూరు జమిందార్ తో పాటు పట్టణ పెద్దలదని, ప్రజా ప్రతినిధులు పండగ సక్రమంగా జరిగేలా సహకరిస్తారని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మంగళ వారం ఉదయం విలేఖరులతో మాట్లాడారు. అమ్మ వారి పండగను జరిపించే విషయంలో పలు రకాలుగా చర్చ జరుగుతున్నదని, అయితే నిజానిజాలు జమిందార్ తో పాటు కొంత మంది పెద్దలకు తెలుసన్నారు. గతంలో జరిగిన శ్యామలాంబ పండగకు ఎంతగానో సహకరించానన్నారు. తదుపరి జరపాల్సిన పండగ నిమిత్తం మూడు నాలుగు సార్లు జమిందార్ తో చర్చించానన్నారు. ఒక సారి యర్ర దాలి నాయుడుతో, తరువాత సిగిరెడ్డి అప్పారావు, మేడిశెట్టి అప్పల నాయుడులతో జమిందార్ విక్రమ చంద్ర సన్యాశి రాజు విచ్చేసారని, ఆయా సందర్భాల్లో తాను పూర్తిగా సహకరిస్తానని చెప్పానన్నారు. అంతేకాకుండా గిరిజన సంక్షేమ శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల తోపాటు జిల్లా కలెక్టర్ నుండి ప్రత్యేక నిధులు రప్పిస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేసారు. అయినప్పటికీ కోవిడ్ తో పాటు మరి కొన్ని కారణాల వలన పండగ జరగ లేదన్నారు. అలాగే శంబర పోలమాంబ ఆలయం అభివృద్ధి కోసం 50లక్షలు మంజూరు చేయిస్తే ఎండోమెంట్ అధికారులు సక్రమంగా వినియోగించు కోలేదన్నారు. పాడేరు మోద కొండమ్మ జాతర నిమిత్తం ప్రతీ ఏటా కోటి రూపాయలు మంజూరు చేయించగా వారు సద్వినియోగం చేసుకున్నారన్నారు.

అమ్మవారి పండగను ఎవరు జరిపించినా మంచిదే... శ్యామలాంబ పండగ జరగడం ముఖ్యమని, ఎవరి ఆధ్వర్యంలో జరిగినా మంచిదేనని రాజన్న దొర అన్నారు. తాను మంత్రిగా ఉండగా పండగ జరిగి ఉంటే ఏ విధంగా సహకరిస్తానని మాట ఇచ్చానో ప్రజలకు తెలుసన్నారు. అయితే ప్రత్యేక కారణాల వలన పండగ జరగ లేదన్నారు. ప్రస్తుత మంత్రి సహకారంతో అమ్మవారి పండగ జరిగితే మంచిదే అన్నారు. అయితే ప్రభుత్వ శాఖల నుండి నిధులు తెప్పించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ, ఎండోమెంట్, జిల్లా కలెక్టర్ నుండి నిధులు ఎక్కువ తెప్పించాలని ప్రజలు ఆశిస్తున్నారన్నారు. పండగ దిగ్విజయంగా జరగాలని, అందుకు తన వంతు సహాయ, సహకారాలను పూర్తిగా అందిస్తానన్నారు. అంతేతప్ప అమ్మవారి పండగను సైతం రాజకీయం చేయడం తనకు చేతకాదన్నారు. 18సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా ఉన్న తాను ఏనాడు గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆంక్షలు విధించలేదని, భక్తుల అభీష్టం మేరకే నిమజ్జనోత్సవాలు జరిగేవన్నారు. అనాదిగా వస్తున్న విధానాలను మార్చడానికి తాము ఎవరి మన్నారు. ప్రజల కోరికను మన్నించడం ప్రజాప్రతినిధుల విధి అన్నారు.ఈ కార్యక్రమం లో ఆయనతో పాటు పట్టణ వైకాపా అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు,కౌన్సిలర్ గిరిరఘు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న ప్రజలకు వైసీపీ అండగా ఉంటుంది

తుఫాను వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ
గూడెం కొత్త వీధి ఎంపీపీ బోయిన కుమారి

విశాలాంధ్ర-జీకే విధి: ఆపదలో ఉన్న గిరిప్రజలకు వైయస్సార్సీపి పార్టీ అండగా ఉంటుందని గూడెం కొత్త వీధి ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ కుంభవృష్టి వర్షాలకు గూడెం కొత్త వీధి మండలంలోని దారకొండ గుమ్మిరేవుల గ్రామపంచాయతీల పరిధిలోని పలు గ్రామాలలో వాగులు పొంగి కొండ చరియలు విరిగిపడి తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులకు నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గూడెం కొత్త వీధి మండలంలోని దారకొండ గుమ్మిరేవుల దుప్పుల వాడ సీలేరు గాలికొండ అమ్మవారి దారకొండ గ్రామపంచాయతీల పరిధిలో భారీ ఎత్తున వరి పంట పొలాలకు ఇండ్లకు తీవ్ర నష్టం ఏర్పడిందని ఎన్నడూ లేని విధంగా కురిసిన వర్షాలకు వరద ప్రభావంతో గిరి రైతులు తమ పంట పొలాలను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయి అంచనాలు వేసి బాధితులకు నష్టపరిహారం అందించే విధంగా అధికార యంత్రాంగం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సకాలంలో స్పందించి అధికారులు గిరి రైతుల పంట పొలాలను పరిశీలించి వారికి నష్టపరిహారం అందించాలని ఎంపీపీ బోయిన కుమారి కోరారు అలాగే దారకొండ గుమ్మరేవుల గ్రామపంచాయతీల పరిధిలోని తీవ్రంగా నష్టపోయిన బ్రిడ్జిలు వరి పంట పొలాలు పరిశీలించారు రైతులకు తప్పనిసరిగా నష్టపరిహారం అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు అనంతరం గుమ్మిరేవుల పంచాయతీలోని మాదిగమల్లు గ్రామంలో ఇండ్లు కొట్టుకుపోయిన గిరి రైతులకు నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మిరేవుల సర్పంచ్ కమలమ్మ, ఉప సర్పంచ్ వెంకటరావు, వైసీపీ జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, గూడెం కొత్త వీధి ఎంపీటీసీ రాజులమ్మ, వెంకట్ నారాయణ, సచివాలయ వెల్ఫేర్ వెటర్నరీ అసిస్టెంట్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవాలో భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర-సీతంపేట/భామిని : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. శ్రమదానంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు అని అన్నారు. పక్షం రోజులు ఈకార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. భామినిలో జరిగిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో శాసన సభ్యులుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎల్ ఐఎంసిఓ (అలింకో(ప్రతినిధి రవిశంకర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కే.కవిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామ శుభ్రత వారోత్సవాలు

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడిమిల్లి గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛత హే సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుండి 17 రోజులపాటు గ్రామ శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ముందుగాగ్రామ వీధుల్లోర్యాలీ నిర్వహించి, స్థానిక వై జంక్షన్లో మానవహారంగా ఏర్పడి పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండా జాకబ్, ఆశ వర్కర్లు, డ్వాక్రా లీడర్లు,పంచాయతీ సెక్రెటరీ వి. పరమేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్యంలో విడివికేల నిర్వహణ పరిశీలన

విశాలాంధ్ర-సీతంపేట : మన్యంలో రైతు ఉత్పత్తి సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విడివికేల నిర్వహణను ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్ కు చెందిన టీడీసి కోల్ మేనేజర్ డిబోతోష్ మెహతా. కన్సల్టెంట్ శ్రీలగ్న మహా పాత్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతంపేటలో నిర్వహిస్తున్న విడివికే జీడిపప్పు తయారీ కేంద్రాన్ని జిసిసి డిఆర్ డిపోలను పరిశీలించారు ఈ ప్రాంతంలో విడివికే కేంద్రాల నిర్వహణ ఏమేరకు అమలు జరుగు తున్నాయి దీని ఆధారంగా ఒడిశాలో కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ, ఐకెపి ఎపిడి సన్యాసిరావు, డిపిఎం వెంకటరమణ, ఏపిఎం విజయకుమారి, చిరంజీవులు, సవర మోహన్లాల్ తదితరులు పాల్గొన్నారు. సీతంపేటలో నిర్వహిస్తున్న వీడీవీకే కేంద్రాన్ని పరిశీలించిన ఒడిశా బృందం

రైతుల సమగ్ర ఆర్థిక అభివృద్ధి కృషి

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగు తుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొ న్నారు. మంగళవారం ఐటిడిఏలో జరిగిన సమావేశం లో పీఓ మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని మండలాలలోని ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ గిరిజన రైతులతో చేయించాలన్నారు. ఏజెన్సీలోని రైతుల భూములలో మట్టి నమూనాలతో ఏపంటలు సాగు చేయుచున్నది ల్యాండ్ ప్రొఫైలుతో మండలాలవారిగా నివేదికల సమర్పించాలన్నారు. అగ్రికల్చరల్, ఆర్టికల్చరల్ ఇంజుమురేషన్ చేయాలని అన్నారు. చేపల పెంపకం రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ ఎఫ్డిఓ బాలాజీని ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. మారుమూల ప్రాంతాలలో సెల్ టవర్లు ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సోలార్ ఫెన్సింగ్ కొరకు భూములు గుర్తిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ కెవి చౌదరి, సావిత్రి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యనారాయణ, అన్ని మండలాలకు సంబంధించిన వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాము కాటుకి యువకుడు మృతి

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల ఎగువగొట్టూరు గిరిజన గ్రామానికి చెందిన సభి శ్రీను 24 పాము కాటుకి గురై మృతి చెందాడు పాచిపెంట పోలీసులు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం సుమారు 3 గంటల సమయంలో నిద్రిస్తున్న సమయంలో తన పెద్ద కూతురు మీదకు పాము ప్రాకినట్లు తన కూతురు కేకలు వేయడంతో లేచి బయటకు వెళ్ళగొట్టే ప్రయత్నంలో శ్రీను చేతి పై కరిచినట్లు తెలిపారు .ఉదయం గురువు నాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం సాలూరు సిహెచ్ తరలించి వైద్యం అందించినప్పటికీ మృతి చెందినట్లు తెలిపారు.

నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-పాలకొండ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పాలకొండ నియోజకవర్గం సంబంధించి స్థానిక శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణంలో జాబ్‌మేలా మంగళ వారం నిర్వహించటం జరిగింది. ఈ జాబ్ మేలాకి 17 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.ఈ రోజు జరిగిన ఈ జాబ్ మేళాకు కు సుమారు 695 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 274 మంది వివిధ కంపనీలో ఎంపిక కావడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాలకొండ %మీరా% నిమ్మక జయకృష్ణ నిరుద్యోగ యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గం లో ఉద్యోగ మేళా నిర్వహించటం చాలా సంతోషకరంగా ఉంది. నిరుద్యోగ యువతీ యువకులు అవకాశం అందిపుచ్చుకోవాలి అని అన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు కట్టుబడి ఈ ప్రభుత్వం ఉంటుంది అని తెలిపారు. నియోజకవర్గం పరిసర ప్రాంతాలలో విద్యను ప్రోత్సహించాలని, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రధన్యతగా భావిస్తమన్నారు. ప్రతి నెల కూడా జాబ్ మేళా నియోజకవర్గంలో నిర్వహిస్తామని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం ఇది రెండోవ సారి ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్దంగా ఉన్నామని మరియు ఇలాంటి అవకాశాలని నిరుద్యోగా యువత అందిపుచ్చుకుని ఉన్నతా శిఖరాలు అదిరోహించాలని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయికుమార్ మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని రాబోయే రోజుల్లో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తామని అన్నారు. ఈ జాబ్ మేళ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె అప్పలనాయుడు ఎం తేజవతి పట్టణ టీడీపీ అధ్యక్షులు సంతోష్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యూ సాయి కుమార్, శ్రీ సత్య సాయి విద్య సంస్థలు వ్యవస్థాపకులు బి లక్ష్మి నారాయణ కరస్పాండెంట్ డి వెంకట రమణ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసరావు, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

స్వచ్ఛత హి సేవ ర్యాలీ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు, విద్యార్థులు కలిపి ఎంపీడీవో పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండడంతో పాటు సమాజ హితం ఆశించి పరిశుభ్రతను సేవను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 ముదిలి శ్రీనివాసరావు, ఎంఆర్‌సి పోల జయరాం ఏపీఎం నాగభూషణ రావు ఏపీఓ శ్రీనివాసరావు గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్ ఉమామహేశ్వర రావు ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ భరత్ చంద్ర వీఆర్వో పంచాయతీ కార్యదర్శి ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



విశాలాంధ్ర-చింతూరు : ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్లోని పరిసరాల పరిశుభ్రత కోసం స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాల అవుతున్న సందర్భంగా ఐటీడీఏ కార్యాలయం నుండి మెయిన్ సెంటర్ వరకు పిఓ స్వచ్ఛభారత్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం చింతూరు మెయిన్ సెంటర్లో వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులతో, వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులతో సిబ్బందితో స్వచ్ఛ భారత్ కొరకు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు, మన కార్యాలయాలు, మన పరిసర ప్రాంతాలు స్వచ్ఛందంగా నిర్వహించుకునే విధంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు ఎక్కడికి అక్కడ అందరం కలిసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించి మన గ్రామాలు, మన వీధులు మన ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా అందరం కలిసి కలిసికట్టుగా పారిశుధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొనే బాధ్యత మన అందరిపై ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 17వ తారీకు నుండి అక్టోబర్ రెండో తారీకు వరకు ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమల ఎంపీడీవో చిట్టి తోటి రవిబాబు, వివిధ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్.డి.ఓ హేమలత సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-పార్వతీపురం : రెవిన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన కే హేమలత సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. బదిలీపై వెళ్తున్న హేమలత కు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ డివిజనల్ అధికారిగా డివిజన్లో మంచి సేవలను అందించారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఆర్డీవోగా అందించిన సేవలు ప్రతి ఒక్కరి మన్నల్ని పొందారని చెప్పారు. ఒక వ్యక్తి వృత్తిలో చూపెట్టిన నిబద్ధత వల్ల వారు చిరస్మరణీయంగా ఉంటారని తెలిపారు. బదిలీపై వెళ్తున్న హేమలత మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో బాధ్యతలను నిర్వహించామని అన్నారు. ఎన్నికల సమయం లోనూ, ఇతర అనేక సందర్భాల్లోనూ పై అధికారుల సహకారం మరువలేనిదన్నారు. పార్వతీపురంలో రెవిన్యూ డివిజనల్ అధికారిగా పని చేయడం ఎంతో సంతృప్తి సంతృప్తి నిచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శోభిక, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాత్సవ, జిల్లారెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి కె శ్రీనివాస రావు, కలెక్టర్ కార్యాలయ విభాగ అధిపతులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-అనంతగిరి : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం అని మండల స్పెషల్ ఆఫీసర్ వి.వి.ఎస్.శర్మ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా అనంతగిరి మండలం బొర్రా పంచాయతీ కేంద్రంలో పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ వివిఎస్ శర్మ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ రెండు వరకు రాష్ట్రమంతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో అన్నిచోట్లను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛత కోసం వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు శెట్టి నిలవేణి మండల అభివృద్ధి అధికారి నగేష్ ఇంచార్జ్ తాసిల్దార్ మాణిక్యం ఆర్ ఐ శంకర్రావు పంచాయతీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ జన్న అప్పారావు గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు పెద్ద బిడ్డ పంచాయతీ కేంద్రంలో కార్యదర్శి అప్పలస్వామి సర్పంచ్ సాలె పెంటమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛతహి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్కూలు విద్యార్థుల చేత మనోహరం చేయించి పరిసరాలు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు.